క్లుప్తంగా

ఉద్యోగాలకు 142 మంది విద్యార్థుల ఎంపిక

తెనాలి: బెంగళూరులోని ఐఎల్ఎం సంస్థ జరిపిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో స్థానిక ఏఎస్ఎస్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు 142 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు విద్యాసంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. కాలేజీలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐఎల్ఎం సంస్థ గత 22 ఏళ్లుగా తమ కాలేజీలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్టు గుర్తుచేశారు.కాలేజీపై గల నమ్మకమే ఇందుకు కారణమన్నారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.21 వేల వేతనంతో ఎనిమిది రాష్ట్రాల్లో ఎక్కడైనా నియమిస్తారని తెలియజేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఐఎల్ఎం కంపెనీ ముందుగా ఆరు నెలల శిక్షణనిచ్చి అనంతరం ఏదొక రాష్ట్రంలో నియమిస్తుందని తెలిపారు.

మదరసా స్కూల్ కాంపౌండ్ వాల్ ప్రారంభం

తెనాలి: పట్టణంలోని 13వ వార్డులోని మదరసా పాఠశాల వద్ద నూతనంగా నిర్మించిన కాంపౌండ్‌వాల్‌ను సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. మున్సిపల్ నిధులు రూ.5.5 లక్షలతో దీన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు, మైనారిటీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇక్కడి మైనారిటీ విద్యార్థులకు మదరసా ఎంతగానో ఉపకరిస్తుందని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, 13వ వార్డు కౌన్సిలరు కుర్రా సుజాత, 15, 34 వార్డుల కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, గోల్డ్ రహిమా, షేక్ మీరావలి, పార్టీ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు పాస్టర్స్ అసోసియేషన్ సమావేశం

తెనాలి టౌన్: రూరల్ మండలం నందివెలుగులోని ఇమ్మానుయేలు ప్రార్థనా గోపురం చర్చిలో మంగళవారం ఉదయం 11 గంటలకు రూరల్ మండల పాస్టర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పాస్టర్ బర్నబాసు సోమవారం తెలిపారు. మండల పాస్టర్స్ నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొంటారని చెప్పారు. మండలంలోని పాస్టర్లు, దైవజనులు సమావేశంలో పాల్గొనాలని పాస్టర్ బర్నబాస్ కోరారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

తెనాలి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు అరెస్టు చేశారు. కొల్లిపరలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏ.వి. చలం, సిబ్బంది సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి 10 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. తెనాలి రైల్వే స్టేషన్ ఐదో ప్లాట్‌ఫారం వైపు నుంచి అమరావతి ప్లాట్స్‌కు నిబంధనలకు విరుద్ధంగా మద్యం సీసాల్ని తీసుకెళుతున్న వ్యక్తిని త్రీ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

జీజీహెచ్‌కి వైద్య పరికరాలు వితరణ



గుంటూరు మెడికల్: జీజీహెచ్‌కి దాతలు వైద్య పరికరాల్ని అందజేయడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రముఖ వ్యాపారస్తులు డి.సుబ్రహ్మణ్యం సతీమణి నాగమణి జ్ఞాపకార్థం సోమవారం కుటుంబ సభ్యులు రూ. 1.75 లక్షల విలువైన 11 ఆక్సిజన్ సిలెండర్లు, కార్డియో టోటోగ్రఫీ, ఆక్సిజన్ గేజ్ ఫ్లో మీటర్లను సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో డి. మురళీకృష్ణ, డి.అపర్ణ లక్ష్మి, గంధం మురళీకృష్ణ, గంధం శ్రీదేవి పాల్గొన్నారు.

మహిళను వేధిస్తున్న పలువురిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: మహిళను ఆమె భర్త, అత్తమామలు, బంధువులు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్వీఎన్ కాలనీలో నివసించే వంగల సింధు సాహికి, జగదీశ్వరరెడ్డికి 15 సంవత్సరాల కిందట వివాహమైంది. జగదీశ్వరరెడ్డి మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్యను కొట్టి వేధిస్తున్నాడు. దీనికి తల్లి భారతి, తండ్రి పెదనరసింహారెడ్డి, బంధువులు సహకరిస్తున్నారు. ఈ మేరకు బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో చోరీ

ఇంట్లో చోరీపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. చంద్రమౌళీనగర్‌లో నివశించే మర్రి లక్ష్మి ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు బీరువా తాళాలు తీసి అందులో రూ. 80వేలు విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ. 20వేలు నగదు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల జీవన ప్రమాణాల పెంపుతోనే అభివృద్ధి

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లక్ష్యం ఇదే..
- జగనన్న కాలనీల్లో మెరుగైన వసతులు
- సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శివకుమార్



సబ్‌స్టేషన్ ప్రారంభించి శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్: పేదవాడి జీవన ప్రమాణాలు, కొనుగోలు శక్తి పెంచడమే అభివృద్ధి అని, ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇదే లక్ష్యంతో పని చేస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి మండలం నేలపాడులోని జగనన్న కాలనీలో రూ. 11.50 కోట్లతో ఏర్పాటు చేసిన అధునాతన విద్యుత్ ఇండోర్ సబ్‌స్టేషన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ పేదల బతుకులు మారాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. జగనన్న కాలనీలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దీని ద్వారా 17,461 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వచ్చని, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసినట్టు ఆయన వివరించారు. 2029 నాటికి తెనాలి పరిసరాల్లోని గ్రామాలు పట్టణంలో విలీనమయ్యే అవకాశం లేకపోలేదని, దాన్ని దృష్టిలో పెట్టుకునే జగనన్న కాలనీల్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాలుగో అధునాతన సబ్‌స్టేషన్‌ను తెనాలిలో ఏర్పాటు చేసుకోవడం ముదావహమన్నారు. గడిచిన నాలుగేళ్ల పది నెలల కాలంలో రెండేళ్లు కరోనా కారణంగా ఎన్నో ఇబ్బందులు ఎదురైనా, ఎక్కడా సంక్షేమాన్ని ఆపలేదని తెలిపారు. మిగిలిన కాలంలోనే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెట్టిందని చెప్పారు. ఈఈ వీవీ చిరంజీవి మాట్లాడుతూ సబ్‌స్టేషన్ నుంచి ఆరు ఫీడర్ల ద్వారా 17,500 సర్వీసులకు విద్యుత్ కనెక్షన్లతో పాటు వ్యవసాయ అవసరాల కోసం మరో ఫీడర్ ద్వారా 200 ఇవ్వచ్చని తెలిపారు. సబ్‌స్టేషన్ విశిష్టతను విద్యుత్ శాఖ కన్‌స్ట్రక్షన్ డీఎం. శ్రీనివాసరావు, ట్రాన్స్‌ఫార్మర్స్ డీఈ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోమవరపు నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక , వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, ఏఈఈ బొర్రా శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

తేలప్రోలులో సచివాలయం ప్రారంభం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్: తేలప్రోలులో పూర్తయిన పలు అభివృద్ధి పనుల్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సోమవారం ప్రారంభించారు. గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ, సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్లు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలో రూ. 28 లక్షలతో సచివాలయ భవనం, రూ. 17 లక్షలతో రోడ్డు నిర్మించినట్టు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల కింద ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్ ఫేజ్–1, ఫేజ్–2, మెయిన్ రోడ్డు సీసీ డ్రెయిన్లు, కల్వర్టు వంటి పనులకు ఇప్పటి వరకు రూ. 1,49,25,000ను కేటాయించినట్లు పేర్కొన్నారు. మరో వైపు సంక్షేమ పథకాల కింద రూ. 28,62,17,945ను గ్రామస్తులకు అందజేశామని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షేక్ బాషా, మాజీ ఎంపీపీ చెన్నుబోయిని శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు షేక్ ఇలియాజ్, ఎండీ గాలిబ్, ముజీర్, ఆజీబ్, అరాఫత్ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడమే లక్ష్యం

రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్

తెనాలి అర్బన్: సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సీ సేఫ్ ప్రాజెక్ట్‌ను రాష్ట్రంలో ప్రారంభించిందని ప్రాజెక్టు రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలోని తల్లీపిల్లల వైద్యశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సీ సేఫ్ లాంచింగ్ ప్రాజెక్టు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అవసరం లేకపోయినా నేడు ఎక్కువగా సిజేరియన్లు చేస్తున్నారని, దాన్ని తగ్గించేందుకు ప్రాజెక్టును రూపొందించినట్లు చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలలో సాధారణ ప్రసవాలు ఎక్కువ జరిగే విధంగా చూడాలని తెలిపారు. గర్భిణులకు కూడా సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సాధారణ ప్రసవం చేసే డెమోను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, యూనిసెఫ్ సంస్థ ప్రతినిధి నాగేంద్ర, డాక్టర్ కె.శిరీష, యూకేకు చెందిన ఈమి విల్సన్, మోతా, ఇంద్రజిత్‌కుమార్, టాంజేనియాకు చెందిన డాక్టర్ జాన్, ఓడో పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి ఘన నివాళి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

నెహ్రూనగర్: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ సోమవారం గుంటూరు లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా ఆయనకు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మీపురంలోని దళిత ఆత్మ గౌరవ పోరాట సంఘం అధ్యక్షుడు గర్నెపూడి సుధాకర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కారు పార్కింగ్ విషయంలో డీఎస్పీ సుధాకర్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. ఆయనపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల్ని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, బండ్లమూడి స్టాలిన్, వేముల ప్రసాద్, జల్ది అనిల్ పాల్గొన్నారు.

పాఠశాలను శుభ్రం చేసిన యోగ మండలి సభ్యులు



విద్యార్థులకు యోగ పుస్తకాలు అందజేసిన కిషోర్ గురూజీ

తెనాలి టౌన్: గంగానమ్మ పేటలోని తోటకూర సుబ్బారావు మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌ను సోమవారం శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి సభ్యులు సందర్శించారు. వ్యవస్థాపకులు కిశోర్ గురూజీ పర్యవేక్షణలో సభ్యులు పాఠశాలలో బూజు దులిపి, శుభ్రంగా కడిగారు. ఈ సందర్భంగా గురూజీ విద్యార్థులకు శుభ్రత, పరిశుభ్రత, అంతఃకరణ శుభ్రత గురించి వివరించారు. విద్యాలయం సమాజానికి తల్లి వంటిదని తెలిపారు. రేపటి యువతకు పునాది అని, విద్యాలయాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు పుస్తకాలు, చాక్లెట్స్, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, యోగ మండలి సభ్యులు చుండూరు సాయి, తారావలి, గోవర్ధని, రాణి, జగన్మోహనరావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, ముంతా శ్రీనివాసరావు, రాంబాబు, సూర్యనారాయణ, యోగ మిత్రులు పాల్గొన్నారు.

కట్టెల పొయ్యిలో పడి వృద్ధురాలు మృతి

పెదకాకాని: వంట చేస్తున్న మహిళ ప్రమాదవశాత్తూ కాలిన గాయాలతో చికిత్స పొందుతూ మరణించిన సంఘటన నంబూరు గ్రామంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని నంబూరు గ్రామానికి చెందిన పులి సాయమ్మ ఆదివారం రాత్రి కట్టెల పొయ్యి వద్ద వంట చేస్తుంగా ప్రమాదవశాత్తూ పొయ్యిలో పడిపోయింది. దీంతో శరీరమంతా కాలి తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం అర్ధరాత్రి పులి సాయమ్మ(83) మరణించింది. భర్త నాలుగు సంవత్సరాల క్రితమే చనిపోయాడు. కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె వీరాస్వామి తెలిపారు.

అరుదైన రికార్డుకు చేరుకున్న అజయ్‌కుమార్‌రెడ్డి

- అంధుల క్రికెట్‌లో 100వ మ్యాచ్ ఆడిన క్రికెటర్
- 100 మ్యాచ్‌లో 96 పరుగులతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ తీసుకుంటున్న అజయ్‌కుమార్‌రెడ్డి

తెనాలి: భారత అంధుల క్రికెట్ జట్టులో ఆడుతున్న మాజీ కెప్టెన్, అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్‌రెడ్డి అరుదైన రికార్డుకు చేరుకున్నారు. భారత–శ్రీలంక జట్ల మధ్య అయిదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో సోమవారం తొలి మ్యాచ్ న్యూఢిల్లీలో జరిగింది. ఈ మ్యాచ్‌లో ఆడిన అజయ్‌కుమార్‌రెడ్డి అంతర్జాతీయ అంధుల క్రికెట్‌లో 100 మ్యాచ్ ఆడిన రికార్డును నెలకొల్పాడు. ఇదే మ్యాచ్‌లో బ్యాటింగ్ చేసి 96 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అందుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ అయిదు వికెట్ల నష్టానికి 277 పరుగులు చేయగా, శ్రీలంక ఆరు వికెట్లను కోల్పోయి 145 పరుగులు మాత్రమే చేసినట్టు తెలియజేశారు. తన సంతోషాన్ని సోమవారం రాత్రి 'సాక్షి'తో పంచుకున్నారు.

సీనియర్ ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీసు కేసు నమోదు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షల్లో మాల్ ప్రాక్టీసుకు పాల్పడిన ఒక విద్యార్థిపై అధికారులు కేసు నమోదు చేశారు. సోమవారం సీనియర్ ఇంటర్ మ్యాథ్స్–2బీ, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు దరఖాస్తు చేసిన 26,510 మంది విద్యార్థుల్లో 25,951 మంది హాజరయ్యారు. 1,105 మంది ఒకేషనల్ కోర్సుల విద్యార్థుల్లో 1,039 మంది హాజరయ్యారు. గుంటూరులోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో ఒకేషనల్ సబ్జెక్టు పరీక్ష రాస్తూ కాపీయింగ్‌కు పాల్పడిన విద్యార్థిపై మాల్ ప్రాక్టీసు కేసు నమోదైంది.

ఉపాధి, పారిశ్రామిక దిక్సూచిగా ఏపీ


ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్



మేడపాటికి జ్ఞాపికను అందజేస్తున్న వీసీ

ఏఎన్‌యూ: రానున్న ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, ఉపాధి రంగాలకు దిక్సూచిగా నిలుస్తుందని ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. వాయిస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ఆధ్వర్యంలో పరిశ్రమలు, ఉపాధి కల్పించే అధికారులకు సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ విశాఖ పారిశ్రామిక రాజధానిగా దినదినాభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఏపీఎన్ఆర్‌టీ చైర్మన్ వెంకట్ ఎస్ మేడపాటి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన ఇచ్చి ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థుల్ని ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఏపీఎన్ఆర్‌టీ ద్వారా ఉచితంగా జీఆర్ఈ, టోఫెల్, ఐఈఎల్టీఎస్ కోచింగ్‌లు ఇస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయంగా ఉన్నత విద్య అవకాశాల్ని రాష్ట్ర విద్యార్థులకు అందించాలనే దృఢ సంకల్పంతో ఈ కోర్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సీఈవో డాక్టర్ డి.వి.రామకోటిరెడ్డి మాట్లాడుతూ మరో ఐదేళ్లలో పారిశ్రామిక రాజధానిగా ఏపీ గుర్తింపు పొందుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రధాన లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. రాష్ట్రంలో ఏటా దాదాపు లక్ష మంది విద్యార్థులు ఆయా కోర్సులు పూర్తి చేస్తున్నారని, అందులో 60 వేల మంది క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు. ఏ విద్యార్థి కూడా నిరుద్యోగిగా ఉండకూడదని లక్ష్యంతో సీఎం రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఏర్పడుతున్న పారిశ్రామిక పార్కులు, పోర్టులు, షిప్పింగ్ యార్డులు వేలాది మంది విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. చెన్నై హెచ్‌సీఎల్ ప్రతినిధి వినోద్ మాట్లాడుతూ ఏపీ ఐటీఏ, హెచ్‌సీఎల్‌లు సంయుక్తంగా డేటా ఇంజనీరింగ్, ఫుల్‌స్టాక్ జావా కోర్సులలో శిక్షణతో పాటు సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. విజయవాడ హెచ్‌సీఎల్ ప్రతినిధి సీహెచ్. సతీష్ కుమార్ మాట్లాడుతూ కమ్యూనికేషన్స్ స్కిల్స్ మెరుగుపరుచుకోవాలని, దీని ద్వారా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని వివరించారు. టెక్ మహేంద్ర ప్రతినిధి వి. శ్రీనివాస్‌రెడ్డి, ఫిక్కీటీ ఎడెక్స్ ఉపాధ్యక్షుడు మూర్తి నిరంజన్, విశ్వవిద్యాలయ రెక్టార్ పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ కరుణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సిద్ధయ్య, డీన్ ఈ. శ్రీనివాస్‌రెడ్డి, ఏపీటీపీఓ కన్సార్టియం సెక్రటరీ ఎస్.వి.సురేంద్రబాబు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం



తాడికొండ: మండల పరిధిలోని ఫణిదరం గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 31 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ సీహెచ్.ప్రభాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో తాడిశెట్టి వెంకటేశ్వర్లు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు సోమవారం ఎస్సై రవీంద్ర బాబు దాడులు నిర్వహించి 31 మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. నిందితుడు తాడిశెట్టి వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

నెలాఖరులోపు పన్నులు చెల్లించండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



చెక్కులను అందుకుంటున్న కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్: ఇంటి, ఖాళీ స్థలాల పన్నుల్ని నెలాఖరులోపు అందరూ చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని ఐతానగర్‌లో సోమవారం పర్యటించారు. పన్నుల బకాయిదారుల్ని కలసి వెంటనే వాటిని చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూలుపై పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బకాయిదారుల వివరాల్ని ప్రతి రోజు తనకు తెలియజేయాలని సచివాలయ ఉద్యోగుల్ని ఆదేశించారు. ప్రతి రోజు పట్టణంలో పర్యటిస్తూ పెద్ద మొత్తంలో పన్నులు చెల్లించాల్సిన వారిని కలసి, వాటిని చెల్లించే విధంగా చూస్తామని చెప్పారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పలువురు నుంచి పన్నుల చెక్కులను అందుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌వో సోమశేఖర్ యాదవ్, ఆర్ఐ మోహన్ కృష్ణ, శ్రీను, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి మరో విజయం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తెనాలి: తమిళనాడులో జూనియర్ సివిల్ జడ్జి ఉద్యోగాల నియామకాలపై తాజాగా అక్కడి హైకోర్టు ఇచ్చిన తీర్పు సామాజిక న్యాయానికి మరో విజయంగా ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. మెరిట్ ఆధారంగా అత్యధిక మార్కులు సాధించిన బీసీ అభ్యర్థుల్ని ఓపెన్ కేటగిరీలో కాకుండా, వారిని బీసీ కేటగిరీలోకి నెట్టి నియామకాలు చేశారని తెలిపారు. ఇది తగదంటూ బీసీ అభ్యర్థుల వినతి ప్రకారం విచారించిన హైకోర్టు, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అన్యాయం జరిగేలా చేసిన నియామకాల్ని రద్దు చేసిందని సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మెరిటోరియస్‌గా ఎన్నికైన ఆ అభ్యర్థుల్ని ఓపెన్ కేటగిరీలో నియమించి, ఆ తర్వాత వారిని ఆయా కేటగిరీల్లో రిజర్వేషను ప్రకారం నియామకాల్ని చేసేందుకు కొత్త జాబితా తయారు చేయాలని తమిళ ప్రభుత్వాన్ని చెన్నై హైకోర్టు ఆదేశించినట్టు వివరించారు. బీసీ సంక్షేమ సంఘం తరఫున ఇదే విషయాన్ని పలుసార్లు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినట్టు శంకరరావు గుర్తుచేశారు. చెన్నై హైకోర్టు తీరు సామాజిక న్యాయ ఉద్యమానికి, అణగారిన వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా లభించిన అతి పెద్ద విజయంగా భావిస్తున్నామని తెలిపారు. ఇకపై ఏ పోటీపరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకైనా ఉద్యోగ నియామకాల్లో ఇదే విధానాన్ని అవలంబించి, అనాదిగా అన్యాయానికి గురవుతూ వస్తున్న రిజర్వేషన్ వర్గాలకు న్యాయం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ సీపీ గెలుపుతోనే పథకాల అమలు



28వ వార్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప, మాజీ చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్



26వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, వైస్ చైర్మన్ నాగవేణి

తెనాలి అర్బన్: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. 28వ వార్డులో అన్నాబత్తుని పుష్ప, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, 26వ వార్డులో చైర్‌పర్సన్ రాధిక, వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాల్ని చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి ఓట్లు అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో 28వ వార్డు కౌన్సిలర్ యాతాటి అనిల్, వైఎస్సార్ సీపీ నాయకులు సిరికృష్ణ, రావి శ్రీనివాసరావు, శ్రీను నాయక్, కఠారి హరీష్, కోలా వాసు, వార్డు నాయకులు, 26వ వార్డులో కౌన్సిలర్లు షేక్ ఇస్మాయేల్, తాడిబోయిన రామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు యలవర్తి గీతాదేవి, ఈద్గా గౌస్, ఇస్రాత్, షేర్వీ జాకీరా పాల్గొన్నారు.

ఆంగ్ల భాష ఉచ్చారణతో ఆరోగ్యానికి మేలు

కేఎల్‌యూ ప్రో చాన్సలర్ డాక్టర్ జగన్నాథరావు



'ది ఎసెన్స్ అండ్ మ్యాట్రిక్స్ ఆఫ్ లిటరేచర్ అండ్ లాంగ్వేజ్' పుస్తకాన్ని విడుదల చేస్తున్న అతిథులు

తాడేపల్లి రూరల్ : ఆంగ్లభాష పలికే విధానం వలన మనిషి మెదడు పనితీరు మెరుగు పడుతుందని కేఎల్‌యూ ప్రో చాన్సలర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు అన్నారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూ ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల భాషా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాష అనేది బ్రెయిన్ యాక్టివిటీ అని, ఆంగ్ల భాష అన్ని పాఠ్యాంశాలకు కేంద్రంగా నిలుస్తుందని తెలిపారు. ఆంగ్ల భాష విభాగాధిపతి డాక్టర్ కె.వి. దివ్య మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరుగుతున్న అంతర్జాతీయ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విద్యావేత్తలు, భాషా పరిశోధకులు అధిక సంఖ్యలో హాజరయ్యారన్నారు. ఆంగ్లభాషపై భాషా శాస్త్రవేత్తలు జరిపిన వివిధ రకాల పరిశోధనా పత్రాల ప్రచురణ జరిగినట్లు తెలిపారు. సుమారు 100 మంది పరిశోధనా పండితులు పత్రాలను సమర్పించారని వివరించారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ కె.కె.సునాలిని మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దాదాపు 200 మంది ప్రతినిధులు ఈ సదస్సులో పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. బ్రిడ్జింగ్ ది గ్యాప్స్, ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ లిటరేచర్ అండ్ లాంగ్వేజ్ స్టడీస్ పుస్తకాలతో పాటు డాక్టర్ సునాలిని, డాక్టర్ కేబీ గ్లోరీలు సరిచేసి ముద్రించిన పుస్తకాలు, డాక్టర్ ఎస్ ఫర్హాద్ సరిచేసి ముద్రించిన ది ఎసెన్స్ అండ్ మ్యాట్రిక్స్ ఆఫ్ లిటరేచర్ అండ్ లాంగ్వేజ్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముంబైకు చెందిన ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ దినేష్‌కుమార్ నాయర్ 'ఓషియానిక్ నేరేటివ్స్ బ్లూ హ్యూమానిటీస్ అండ్ నాటికల్ ఫిక్షన్' అనే అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్ఈడీ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్, కో ఆర్డినేటర్ డాక్టర్ శివగంగ ప్రసాద్, జోధ్‌పూర్‌కు చెందిన జై నారాయణ వ్యాస్, యూనివర్సిటీ ఆచార్యులు, డీన్ డాక్టర్ కల్పనా పురోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్, ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నగర అధ్యక్షుడు వెంకటలక్ష్మణ్‌ను సన్మానిస్తున్న జిల్లా కార్యవర్గం

గుంటూరు మెడికల్: ల్యాబ్ అండ్ ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ గుంటూరు టౌన్ అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన గ్లోబల్ ల్యాబ్స్ నిర్వాహకులు మద్దికాయల వెంకటలక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ సెక్రటరీగా బి.శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎస్.వెంకటరమణారావు ఎన్నికయ్యారు. నూతన కమిటీని సోమవారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి, సెక్రటరీ తాడికోరు శ్రీహరి, గౌరవ అధ్యక్షుడు బి.వి.ఎస్.కె.విశ్వనాథ్ ప్రకటించి ప్రమాణ స్వీకారం చేయించారు. జాయింట్ సెక్రటరీగా కె.బాలు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.డి.మస్తాన్, ఈసీ మెంబర్స్‌గా పి.నాగరాజు, వి.బాలకోటేశ్వరరావు, కె.బాలకృష్ణ, పి.రాజశేఖర్, ఎస్.డి.మన్సూర్ అలి, టి.ఎస్.కోటేశ్వరరావు, సురేష్, ఐ.సాంబశివరావు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన నగర కమిటీకి జిల్లా నేతలు రామ్మోహన్‌రావు, వెంకటకృష్ణ, రాజ్‌కుమార్, బాబ్జి అభినందనలు తెలిపారు.